27, 28 తేదీల్లో నీటి సరఫరాకు అంతరాయం

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు జలమండలి చేపట్టిన మర్మతులు, నిర్మాణ పనుల కారణంగా కావేరి నాలుగో దశ రెండో స్టేజ్ పరిధిలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ మేరకు జలమండలి నగరంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 27న ఉదయం 6 గంటల నుంచి 28 ఉదయం 6 గంటల వరకు నీటి సరఫరా ఉండదని ప్రజలు సహకరించాలని కోరింది. ముందు జాగ్రత్తగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని నగరవాసులు సహకరించాలని ప్రకటనలో పేర్కొంది.



పోడియంలో ప్రతిపక్షాల నిరసన

శాసనసభలో రభస

- కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేక తీర్మానంపై ప్రతిపక్షాల నిరసన
- ప్రధాని మోదీకి అనుకూలంగా నినాదాలు
- రాష్ట్రానికి జరిగిన అన్యాయంపైనే మా పోరాటం : మంత్రి పాటిల్
- 26కు శాసనసభ వాయిదా

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో గురువారం ప్రవేశపెట్టిన తీర్మానంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. శుక్రవారం శాసనసభ కార్యకలాపాల ప్రారంభం కాగానే తీవ్రమైన గందరగోళం చోటుచేసుకుంది. కేంద్రప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి జరుగుతున్న అన్యాయంపై శాసనసభలో ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన తీర్మానంపై శాసనసభ అట్టుడికింది. సభ కార్యకలాపాలు ప్రారంభం కాగానే ప్రతిపక్షనేత ఆర్. అశోక్ సహా బీజేపీ, జేడీఎస్ సభ్యులంతా మూకుమ్మడిగా పోడియంలోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. శాసనసభ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్మానాన్ని ఎలా ప్రవేశపెడతారని ప్రశ్నించారు. కేవలం రాజకీయ పరపతి పెంచుకునేందుకు అధికార కాంగ్రెస్ శాసనసభా వేదికగా కుట్రకు సిద్ధమైందన్నారు. కార్యకలాపాలు జరిగే వేళ తీర్మానాలపై ముందస్తుగా తెలుపుతారని, తర్వాత చర్చిస్తారని పేర్కొన్నారు. ముందస్తు సమాచారం లేకుండా ఉన్నఫళంగా కేంద్రప్రభుత్వాన్ని హేళన చేసేలా తీర్మానం ప్రవేశపెట్టారన్నారు. దీనిపై స్పీకర్ కూడా తమ దృష్టికి తీసుకురాలేదన్నారు. పేదలకు సంబంధించి అంశాలపై చర్చలు జరగాలని, వాటికి సహకరిస్తున్నామని, ఇలా మోసపూరితంగా కేంద్రప్రభుత్వంపై తీర్మానం ఎలా తీసుకువస్తారని ప్రశ్నించారు. చేతనైతే బహిరంగంగా ప్రకటించి తీర్మానం తీసుకురావాల్సి ఉండేదని సవాల్ విసిరారు. కేంద్రప్రభుత్వంపై నిర్ణయం తీసుకునేముందు శాసనసభ నిబంధనలు పాటించాల్సి ఉంటుందన్నారు. గురువారం తీర్మానం ప్రవేశపెట్టిన వేళ సూచిక లేదని, నిబంధనల ప్రకారం లేదని మండిపడ్డారు. ఇదే సందర్భంలో శాసనసభ, న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మాట్లాడుతూ కర్ణాటక సంక్షేమం కోసం కేంద్రంపై వ్యతిరేక తీర్మానాన్ని తీసుకువచ్చామన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి జరిగే అన్యాయంపై మాత్రమే వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇందులో ఎటువంటి రహస్యం లేదని, ఏడుకోట్ల మంది కన్నడిగుల ప్రజాధ్వని ఉందని సమర్థించుకున్నారు. ప్రతిపక్షాల ఆరోపణలను, పోడియంలో నిరసనలను తిప్పికొట్టారు. తీర్మానం ప్రవేశపెట్టేందుకు మీ అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. నిబంధనల ప్రకారమే తీర్మానం తీసుకువచ్చామన్నారు. మీకు రాజకీయాలు కావాలా లేక ప్రజాసంక్షేమం ముఖ్యమని భావిస్తారా అంటూ ప్రతిపక్ష సభ్యులను ప్రశ్నించారు. తమకు పాఠాలు చెప్పకండి అంటూ రెవెన్యూశాఖా మంత్రి కృష్ణభైరేగౌడ తీవ్రంగా మండిపడ్డారు. కేంద్రప్రభుత్వం, ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి అనుకూలంగా తీర్మానం ప్రవేశపెట్టాలని ప్రతిపక్షనేత అశోక్ ప్రతిపాదించారు. అందుకు స్పీకర్ యూటీ ఖాదర్ అనుమతులు ఇవ్వలేదు. అయినా ప్రతిపక్షనేత అశోక్ చర్చకు పట్టుబట్టడడంతో వివాదం నెలకొంది.

26కు శాసనసభ వాయిదా

శాసనసభ కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ నిరసన కొనసాగించడం, గందరగోళంగా మారడంతో సభను స్పీకర్ కాసేపు వాయిదా వేశారు. మరోసారి సభ ప్రారంభమైనా ఎటువంటి మార్పు లేకపోవడంతో కార్యకలాపాలను సోమవారం ఉదయం 9.30గంటలకు వాయిదా వేశారు. ముందస్తు షెడ్యూలు ప్రకారం సభ శుక్రవారంతో ముగియాల్సి ఉంది. కానీ కేంద్రప్రభుత్వంపై వ్యతిరేక నిర్ణయం తీర్మానం అంశమై వివాదం చెలరేగడంతో సోమవారం కలాపాలు సాగించేలా నిర్ణయం తీసుకున్నారు.

తీర్మానానికి బీజేపీ మద్దతు ఇవ్వాలి : డీసీఎం



బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి న్యాయసమ్మతంగా రావాల్సిన పన్నుల వాటా, కరువు నిధులు తదితర విషయాలలో అన్యాయం చేస్తోందని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆరోపించారు. విధానసౌధలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని శాసనసభలో తాము ప్రవేశపెట్టిన తీర్మానానికి బీజేపీ మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి విరుద్ధంగా పోరాడుతున్నామే తప్ప కేంద్రానికిగానీ, ప్రధానికిగానీ వ్యతిరేకం కాదన్నారు. ఈ విషయంలో బీజేపీ అనవసర రాద్ధాంతం చేస్తోందన్నారు. శాసనసభలో ఈ తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపాలని నిర్ణయించామన్నారు. చట్టపరిధిలోనే తీర్మానం ప్రవేశపెట్టామన్నారు. దురదృష్టవశాత్తు రాజకీయ ప్రయోజనాలకోసమే బీజేపీ, జేడీఎస్ రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోవడం లేదని నిప్పులు చెరిగారు. ప్రతి అంశాన్ని బీజేపీ మత విద్వేషాల కోణంలో చిచ్చు రేపే ప్రయత్నం చేస్తోందని, శాంతి సామరస్యాలకు పేరొందిన కర్ణాటకలో బీజేపీ పప్పులు ఉడకవన్నారు. లౌకికవాదం ముసుగుతీసేసిన జేడీఎస్ కూడా బీజేపీ మతోన్మాద ఉచ్చులో చిక్కుకుందని ఆయన వ్యాఖ్యానించారు.

కృష్ణానదిపై వంతెన అంచనా వ్యయం పెంపు

కృష్ణానదిపై జమఖండి - అథణి మధ్య నిర్మించతలపెట్టిన వంతెన నిర్మాణ ఖర్చును రూ.60కోట్ల నుంచి రూ.99కోట్లకు పెంచేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని ఉపముఖ్యమంత్రి తెలిపారు. విధానపరిషత్‌లో సభ్యుడు హనుమంతప్ప నిరాణి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ త్వరలోనే ఈ వంతెన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. 480 మీటర్ల పొడవు, 533 మీటర్ల ఎత్తుతో తొలుత ఈ వంతెన నిర్మించాలని తలపెట్టామని ఇప్పుడు దీన్ని 680 మీటర్ల పొడవు, 534 మీటర్ల ఎత్తుకు పెంచామన్నారు. 24నెలల అవధిలో పనులు పూర్తి చేస్తామన్నారు. మధ్యప్రదేశ్ తరహాలో రాష్ట్రంలో బిందుసేద్యానికి ప్రోత్సాహం అందజేసే ఆలోచన ఉందన్నారు. అప్పర్‌కృష్ణ మూడో దశ ప్రాజెక్టు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నామన్నారు. బెంగళూరులో రూ.372 కోట్లతో శౌచాలయాలు నిర్మించే ఆలోచన ఉందన్నారు.



యలహంకలో ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణకు మద్దతుగా ప్రవాసాంధ్రుల నిరసన ర్యాలీ

ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన

గూండాలను అరెస్టు చేయాలి

- యలహంకలో ప్రవాసాంధ్రుల నిరసన ర్యాలీ

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి జగన్ నిర్వహించిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన గూండాలను వెంటనే అరెస్టు చేయాలని ప్రవాసాంధ్రులు డిమాండ్ చేశారు. యలహంకలో శుక్రవారం సాయంత్రం ప్రవాసాంధ్రులు, తెలుగుదేశం పార్టీ అభిమానులు, చేనేత కార్మిక సంఘం ముఖ్యుల ఆధ్వర్యంలో నిరసన సాగింది. స్థానిక చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు చిన్నప్ప, ఖాదీ బోర్డు మాజీ ఛైర్మన్ పాపణ్ణ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పాల్గొనే సభలో పత్రికా ఫొటోగ్రాఫర్లు ఫొటోలు తీయడం కూడా నేరంలా భావించడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. మానవత్వం కోల్పోయి రాక్షసుల్లాగా శ్రీకృష్ణపై గుంపుగా వచ్చి దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో పాత్రికేయులపై దాడులు పెరిగాయని మండిపడ్డారు. శ్రీకృష్ణపై దాడిని వైసీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు ఒక్కరు కూడా ఖండించకపోవడం దారుణమన్నారు. దాడి చేసిన అందరినీ వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో పురుషోత్తమ్, వీరభద్ర, వేణుగోపాలరెడ్డి, అప్పారెడ్డి, సుధాకరరెడ్డి, మీసాలరెడ్డి, అశోక్, నాగేంద్ర, నాగార్జున, పవన్‌కుమార్, రవీంద్ర, రమణ, మోహన్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఇటీవల కర్నూలులో ఈనాడు కార్యాలయంపై దాడిని, టీవీ5 ప్రతినిధిపై దాడిని ఖండించారు.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో ధరల పట్టికను ప్రదర్శించాలి

- ఆరోగ్య శాఖ మంత్రి దినేష్ గుండూరావు



బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు వైద్యపరీక్షలు, చికిత్సల ధరల పట్టికలను ప్రదర్శించాల్సిందేనని ఆరోగ్య శాఖ మంత్రి దినేష్ గుండూరావు పేర్కొన్నారు. శాసనసభ ఉభయసభల్లోనూ కొందరు సభ్యులు ప్రైవేట్ ఆసుపత్రులు వైద్యపరీక్షలు, చికిత్సల పేరిట రోగుల నుంచి భారీగా వసూలు చేస్తున్నాయంటూ ఆరోపించిన నేపథ్యంలో మంత్రి ఈ మేరకు వివరణ ఇచ్చారు. కేపీఎంఈ చట్టాల ప్రకారం ప్రైవేట్ ఆసుపత్రులు ఏ వైద్యపరీక్షకు ఎంత ధర, చికిత్సలకు ఎంత ధర అనే బోర్డులను ప్రదర్శించాలని ఇలా ప్రదర్శించకపోతే నోటీసులు ఇచ్చి ఆపై లైసెన్సులను రద్దుచేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ మేరకు ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్వయంగా పర్యవేక్షణ జరిపేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. యశస్విని పథకం క్రింద ఉచిత వైద్యచికిత్సలను అందజేసేందుకు నిరాకరించే ఆసుపత్రులపై కూడా చర్యలు ఉంటాయన్నారు.

అమాంతం పెరిగిన ఆస్తులు

- ఆ ఆరుగురు ఎంపీల ఆదాయం ఎన్నో రెట్లు పైపైకి..
- ఏడీఆర్ నివేదిక వెల్లడి



బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన ఆరుగురు ఎంపీల ఆస్తులు గత 15 సంవత్సరాల వ్యవధిలోనే ఎన్నోరెట్లు పెరిగాయని అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదిక పేర్కొంది. విజయపుర బీజేపీ ఎంపీ రమేష్ జిగజిణగి ఆస్తి (ఎన్నికల సంఘానికి అందజేసిన అఫిడవిట్ ప్రకారం) 2004లో రూ. 54.80 లక్షలు ఉండగా 2009లో రూ.1.17 కోట్లకు, 2014లో రూ. 8.94 కోట్లకు 2019లో రూ. 50.41 కోట్లకు చేరుకున్నాయి. మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుతం బెంగళూరునార్త్ బీజేపీ ఎంపీగా ఉన్న డీవీ సదానందగౌడకు 2004లో రూ.46.30 లక్షల మేరకు ఆస్తులు ఉండగా 2009లో రూ.1.43 కోట్లకు, 2014లో రూ.9.88 కోట్లకు, 2019లో రూ.20.93 కోట్లకు పెరిగాయని నివేదిక పేర్కొంది. దావణగెరె బీజేపీ ఎంపీ జీఎం సిద్దేశ్వర ఆస్తులు 2004లో రూ.5.02 కోట్లు ఉండగా 2009 నాటికి రూ. 14.02 కోట్లకు, 2014 నాటికి రూ.23.23 కోట్లకు, 2019 నాటికి రూ 38.01 కోట్లకు పెరిగాయి. హుబ్బళ్లి ధార్వాడ బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి 2004లో రూ.77 లక్షల మేరకు ఆస్తి ఉండగా, 2009 నాటికి ఇది రూ.1.44 కోట్లకు, 2014 నాటికి రూ.4.19 కోట్లకు, 2019 నాటికి రూ.11.13 కోట్లకు పెరిగాయి. ఉత్తర కన్నడ బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డేకు 2004లో రూ.12.06 లక్షల ఆస్తులు ఉండగా, 2009 నాటికి రూ. 64.27 లక్షలకు, 2014 నాటికి రూ. 3.23 కోట్లకు, 2019 నాటికి రూ. 8.47 కోట్లకు చేరుకున్నాయి. బాగల్కోటె బీజేపీ ఎంపీ పీసీ గద్దిగౌడర్ ఆస్తి 2004లో రూ 53.75 లక్షలు కాగా, 2009 నాటికి రూ.1.67 కోట్లకు, 2014 నాటికి రూ.3.63 కోట్లకు, 2019 నాటికి రూ.4.39 కోట్లకు చేరుకుందని ఏడీఆర్ నగరంలో విడుదల చేసిన నివేదికలో పేర్కొంది.

అభ్యర్థుల ఎంపికపై బీజేపీ కసరత్తు

- ముఖ్యనేతలతో లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జ్ సమావేశం
- రాజ్యసభ ఎన్నికలపైనా చర్చ

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల ఎంపిక కసరత్తుకు బీజేపీ శుక్రవారం శ్రీకారం చుట్టింది. మల్లేశ్వరంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటైన ఈ కీలక సమావేశానికి లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా ఉన్న రాధామోహన్‌దాస్ అగర్వాల్ సారథ్యం వహించారు. మొత్తం 28 నియోజకవర్గాల వారీగా సమావేశంలో చర్చ జరిగింది. ఈ ప్రత్యేక సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర, మాజీ ముఖ్యమంత్రులు బీఎస్ యడియూరప్ప, డీవీ సదానందగౌడ, బసవరాజ్ బొమ్మై, ప్రతిపక్షనేత ఆర్. అశోక్‌తోపాటు పలువురు సిట్టింగ్ ఎంపీలు, లోక్‌సభ ఎన్నికల కమిటీలో ఉన్న ప్రముఖ నేతలు హాజరయ్యారు. జేడీఎస్‌తో పొత్తు దరిమిలా ఏ ఏ నియోజకవర్గాలను ఆ పార్టీకి కేటాయించవచ్చు అనే అంశంపై కూడా చర్చ జరిగింది. ఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాతో జరిగిన చర్చ అనంతరం జేడీఎస్‌కు 3-4 సీట్లు కేటాయించేందుకు అంగీకారం కుదిరిందన్న మీడియా కథనాలపై ప్రతిపక్షనేత అశోక్ స్పందిస్తూ ఇంతవరకు సీట్ల ఖరారు కాలేదన్నారు. రాష్ట్రానికి చెందిన బీజేపీ, జేడీఎస్ నేతల సమక్షంలోనే సీట్ల పంపిణీ వ్యవహారాన్ని అధికారికంగా ప్రకటిస్తామన్నారు. ఊహాజనిత కథనాలపై తాను స్పందించబోనన్నారు. కాగా ఈనెల 27న రాజ్యసభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కూడా సమావేశంలో చర్చించినట్టు తెలుస్తోంది.



వేదికపై బీజేపీ ముఖ్యనేతలు



కలబురగి నుంచి ఖర్గే పోటీ చేయాలి

- జిల్లా ఎమ్మెల్యేల తీర్మానం

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కలబురగి లోక్‌సభ స్థానం నుంచి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పోటీ చేయాలని జిల్లా ఎమ్మెల్యేలు తీర్మానించారు. బెంగళూరులోని ఓ హోటల్‌లో గురువారం రాత్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మంత్రులు ప్రియాంక ఖర్గే, శరణ ప్రకాశ్ పాటిల్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేలు ఖనీజా ఫాతిమా, అల్లమప్రభు పాటిల్, అజయ్‌సింగ్, ఎమ్మెల్సీ తిప్పణ్ణ కమకనూరుతోపాటు పలువురు పాల్గొన్నారు. కలబురగి నుంచి సుదీర్ఘకాలంగా ఖర్గే పోటీ చేస్తున్నారని, మరోసారి అక్కడి నుంచే నిలబడాలని తీర్మానించారు. ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ నాయకులంతా మల్లికార్జున ఖర్గేకు మద్దతు తెలిపారు.

నగరంలో మరో నిమ్హాన్స్ ఆసుపత్రి

- ఉత్తర తాలూకాలో ఏర్పాటుకు సన్నాహాలు



మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్


బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో మానసిక రోగులకు సకాలంలో వైద్యం అందుబాటులోకి తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. బెంగళూరు ఉత్తర తాలూకా పరిధిలో రెండో హైటెక్ నిమ్హాన్స్ ఆసుపత్రిని నిర్మించనుంది. 40 ఎకరాల విస్తీర్ణంలో మల్టీ సూపర్ స్పెషాలిటీ నిమ్హాన్స్ ఆసుపత్రిని నిర్మిస్తామని వైద్యవిద్యాశాఖ మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్ తెలిపారు. శుక్రవారం నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ బెంగళూరుతోపాటు సమీపంలోని వంద కిలోమీటర్ల పరిధిలో రోడ్డు ప్రమాదాల వేళ తలకు తీవ్రమైన దెబ్బలు తగిలి సకాలంలో వైద్యం అందక చాలామంది మృత్యువాత చెందుతున్నారన్నారు. ప్రస్తుతం నిమ్హాన్స్‌లో అత్యవసర సేవల ద్వారా ప్రమాదబాధితులకు చికిత్సలు అందుతున్నా రోగుల సంఖ్య ఒక్కోసారి పదులకుపైగా ఉండడంతో ఇబ్బందికరంగా ఉందన్నారు. అందుకే నిమ్హాన్స్ రెండోశాఖను ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న నిమ్హాన్స్‌పై పలు ఒత్తిళ్లు ఉన్నాయన్నారు. పడకల సమస్యతోపాటు వైద్యం కోసం రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితి కొనసాగుతోందన్నారు. నిమ్హాన్స్‌కు దక్షిణభారత్‌లోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడుకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో వస్తుంటారని వివరించారు. నిమ్హాన్స్ రెండోశాఖ ఏర్పాటు కోసం గతంలోనే కేంద్ర వైద్యఆరోగ్యశాఖకు ప్రతిపాదనలు వెళ్లాయన్నారు. కేంద్రప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో 40 ఎకరాల విస్తీర్ణంలో క్యాస్సనహళ్లి వద్ద రెండోశాఖను నిర్మిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే భూమిని గుర్తించే ప్రక్రియ పూర్తయిందన్నారు. దేశంలోనే అత్యాధునిక మానసిక వైద్యవిధానం ఇక్కడ అమలు చేస్తామన్నారు. నరాల సమస్యతోపాటు బ్రెయిన్ సర్జరీలు జరిపేలా నిపుణులను తీసుకొస్తామన్నారు. తద్వారా సకాలంలో ఎక్కువ మందికి వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన

ఢిల్లీలో రైతుల పోరాటానికి మద్దతుగా నిరసన

బాగేపల్లి, ఫిబ్రవరి 23: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక వ్యవసాయ విధానాలపై ఢిల్లీలో పోరాటం చేస్తున్న రైతులకు మద్దతుగా సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సంయుక్త పోరాట కర్ణాటక, కార్మిక సంఘాల జాయింట్ కమిటీ, సీపీఎం సంయుక్తంగా పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర కూలి కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు మునివెంకటప్ప మాట్లాడుతూ రైతులను కేంద్రప్రభుత్వం దేశద్రోహుల మాదిరిగా పరిగణిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు పోరాటంపై బాష్పవాయువు ప్రయోగించడాన్ని తప్పుబట్టారు. చలో ఢిల్లీ చేపట్టిన రైతుల హక్కులను కాపాడాలన్నారు. రైతులను అడ్డుకునేందుకు ఉంచిన బలగాలను వెనక్కి తీసుకోవాలన్నారు. చర్చల ద్వారా పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ నివేదిక ప్రకారం పంటలకు కనీస మద్దతుధర, డబ్ల్యూటీఓ ఒప్పందం నుంచి కేంద్రం బయటకు రావాలని, రైతులకు పింఛన్, ఫసల్ బీమా పద్ధతిలో మార్పు రావాలన్నారు. గత పదేళ్లలో రైతు పోరాటంలో అశువులు బాసిన 750 మంది రైతుల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళిత హక్కుల సమితి అధ్యక్షుడు బిళ్లూరు నాగరాజు మాట్లాడుతూ ప్రజాప్రభుత్వ వ్యవస్థలో శాంతియుతంగా ప్రతిఘటించే హక్కు ప్రతి ఒక్కరికి ఉందన్నారు. రైతుల శాంతిపోరాటంపై పోలీసుల లాఠీచార్జ్, బాష్పవాయు ప్రయోగం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సందర్భంగా చన్నరాయప్ప, అశ్వథప్ప, కృష్ణప్ప, ఓబళరాజు, సావిత్రమ్మ, కృష్ణప్ప పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1587.45	1,607.68
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	763	11,172
సామర్థ్యం (టీఎంసీలు)	9.03	33.23

రోడ్లపైన యాష్ పౌడర్ పడితే చర్యలు



లారీలను తనిఖీ చేస్తున్న పోలీసు

కంప్లి, ఫిబ్రవరి 23 : కుడితిని పరిధిలో వున్న కేపీసీఎల్ నుంచి యాష్ పౌడర్‌ను లారీల ద్వారా తరలించే సమయంలో రోడ్లపై పడినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని కేపీసీఎల్ అధికారులు తెలిపారు. ఇప్పటికే కేపీసీఎల్ నార్త్ గేట్ తిమ్మలాపురం వైపు కంప్లి, కుడితిని రోడ్డు వైపు వెళ్లే లారీలను పోలీసులు పూర్తిగా తనిఖీ చేసిన అనంతరమే వాటిని అనుమతిస్తున్నామన్నారు. అలా కాకుండా ఇష్టమొచ్చినట్లు యాష్ లోడు తీసుకుని రోడ్లపై లీక్ చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగేలా యాష్‌ను తరలించినట్లయితే వారిపై నిషేధం చేపడతామన్నారు. తామిచ్చిన నిబంధనల ప్రకారమే యాష్‌ను తరలించాలని తెలిపారు.

సంగపూర్ గ్రామంలో రాజ్యాంగ జాతా

గంగావతి, ఫిబ్రవరి 23: గంగావతి తాలూకా సంగపూర్ గ్రామంలో శుక్రవారం రాజ్యాంగ జాతాను గ్రామ పంచాయితీ అధికారులు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రాన్ని ఊరేగిస్తూ రాణాప్రతాప్ సింహ సర్కిల్ వరకు జాతా సాగింది. తహసిల్దార్ మంజునాథ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగం గురించి ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే పరన్నామునవళి, బోజప్ప, ఉలగప్ప, మురుగేశ్, అమ్రేశ్, బసవరాజు, మరియప్ప, ఉలిగేశ్ శంకర్, మంజునాథ్ పాల్గొన్నారు.

ఏడుపడగల నాగప్పకు ప్రత్యేక పూజలు



పూజలు అందుకున్న నాగప్ప

కంప్లి, ఫిబ్రవరి 23 : బుక్కసాగర గ్రామం వద్ద కొండల్లో వెలసిన ఏడుపడగల నాగప్పకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగప్పకు జలాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, తదితర పూజలు చేపట్టి పుష్పాలంకరణ చేపట్టారు. ఈ పూజల్లో బళ్లారి విజయనగర జిల్లాలతో పాటు వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి భక్తులు పూజల్లో పాల్గొని స్వామివారికి మొక్కులు సమర్పించుకున్నారు.

నేడు గాంధమ్మదేవి, యల్లమ్మదేవి రథోత్సవాలు

సిరుగుప్ప, ఫిబ్రవరి 23 : మాఘ పూర్ణిమ సందర్భంగా శనివారం సిరుగుప్ప తాలుకాలోని దేశనూరు మార్గంలో గాంధమ్మదేవి, రారావి గ్రామంలో యల్లమ్మదేవి మహారథోత్సవాలు జరుగనున్నాయి. ప్రతి యేడాది పౌర్ణమినిపురస్కరించుకుని ఈ అమ్మవార్ల మహారథోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. జాతర మహోత్సవాల సందర్భంగా రారావి గ్రామంలో కుంభ మహోత్సవాలు, ఎద్దుల పరుష జరుగనున్నాయి. కావున అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని రథోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

మోదీ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



గ్రామంలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

కంప్లి, ఫిబ్రవరి 23 : దేశ ప్రధాని నరేంద్రమోదీ విజయాలను ప్రతి ఒక్కరికి తెలియజేయాల్సిన అవసరం వుందని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప తెలిపారు. ఆయన శుక్రవారం సిరుగుప్ప తాలుకాలోని వివిధ గ్రామాలను సందర్శించారు. దేశ ప్రధాని ఈ పదేళ్లలో సాధించిన విజయాలను వివరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సభ్యులను అఖండమెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా పురసభ మాజీ అధ్యక్షులు ఈరణ్ణ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హులిగమ్మ భక్తులకు స్నాన పరీక్ష!

- దేవస్థానానికి వచ్చే భక్తులకు నీటి కొరత
- ఎండిన తుంగభద్ర నది
- మౌలిక సౌకర్యాలు లేక అగచాట్లు

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 23: స్నానం చేస్తేనే అమ్మవారి దర్శనం. ఇదీ హులిగమ్మ దేవస్థానంలో నియమం. అయితే స్నానం మాట దేవుడెరుగు... కాళ్ళుకూడా తడపలేని స్థితిలో నీటి కొరత ఏర్పడింది. దీంతో ట్యాంకర్ల వద్ద నీరు కొనుక్కొని స్నానం చేసి దైవదర్శనం చేసుకునే పరిస్థితి హులిగమ్మ దేవస్థానంలో నెలకొంది. ప్రతి అమావాస్య, పౌర్ణమి రోజుల్లో కొప్పళ జిల్లా మునిరాబాద్ పరిధిలోని హులిగమ్మ దేవస్థానం భక్తులతో కిటకిటలాడుతుంటుంది. అందులో మాఘ పౌర్ణమి శనివారం రోజున హులిగమ్మ దేవి దర్శనానికి లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది. అయితే భక్తులు నదీ స్నానాలు చేసేందుకు తుంగభద్ర నదిలో నీరు లేకపోవడంతో దైవ దర్శనానికి వచ్చే భక్తులు నీటి పరీక్ష ఎదుర్కొంటున్నారు. ఉత్తర కర్నాటకలో శక్తి పీఠంగా చెప్పుకునే హులిగమ్మ దర్శనానికి రాష్ట్రంలో పాటు పొరుగు రాష్ట్రాల నుండి అశేషమైన భక్తులు వస్తుంటారు. ఈ ఏడాది వర్షాలు లేని కారణంగా తుంగభద్ర జలాశయం పూర్తి స్థాయిలో నిండక నది దిగువకు నీటిని వదలలేదు. దీంతో నదిలో నిలిచిన నీరు కాస్త ఆవిరి కాగా... భక్తులు స్నానాలు చేయడం గగనమై పోయింది. దేవస్థానం బోర్లతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉంది.



హులిగమ్మ వారి దేవస్థానం



ఈ ట్యాంకర్ల నీరే భక్తులకు ఆధారం

అంతేకాకుండా సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు అవసరమైన పార్కింగ్ వ్యవస్థ లేకపోవడంతో దేవస్థానానికి వాహనాల్లో వచ్చిన వారు అంగళ్ళ ముందే వాటిని పార్కింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆలయ చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో సామూహిక మరుగు దొడ్లు లేకపోవడం మరో సమస్య. యాత్రికులు విధి లేని స్థితిలో నదీతీర ప్రాంతంలోనే కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. హులిగిలో రైల్వే స్టేషన్, బస్టాండు ఉన్నా... ఎక్కడా మరుగుదొడ్లు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

బళ్లారి రూరల్, ఫిబ్రవరి 23: తాలుకాలోని ఏ వన్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్ కాన్పూరు జిల్లా బుక్కనహి గ్రామానికి చెందిన కర్నాల్ సింగ్ (24) కనిపించడంలేదని అతడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ యువకుడు హిందీ మాట్లాడగలడని, గుండ్రని ముఖం, తెలుపు రంగులో వుండవచ్చునని పోలీసులు తెలిపారు. అతడి ఆచూకీ తెలిసిన వారు 9480803052 నెంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

నేడు కోటమల్లేశ్వర జాతర

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 23: బళ్లారి భక్తుల ఆరాధ్యదేవుడైన కోట మల్లేశ్వరస్వామి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు దేవాలయ కమిటీ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. మల్లేశ్వరస్వామి ఉత్సవాలు ప్రతి యేటా మాఘ పౌర్ణమి రోజు నిర్వహిస్తారు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం ఉత్సవం సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నారు.

బస్సులు సక్రమంగా నడపండి



బస్సుసౌకర్యం కోసం వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కంప్లి, ఫిబ్రవరి 23 : సిరిగేరి గ్రామ పరిధిలోని కురుగోడు, కంప్లి, సిరుగుప్ప, కొంచిగేరి, దాసాపురం, నాళాపురం, ముద్దటనూరు తదితర గ్రామాలకు సక్రమంగా బస్సులు తిరిగేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కేఎస్‌ఆర్టీసీ జిల్లా అధికారి ఇలియాత్ భాగ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నాగరాజుస్వామి మాట్లాడుతూ రానున్న నెలలో పదవ తరగతి పరీక్షలు మొదలవుతాయని, గ్రామాల నుంచి విద్యార్థులు తమ సెంటర్లకు వెళ్లాలంటే ఎంతో ఇబ్బంది పడతారని, కనుక ముందుగానే సిరిగేరి పరిధిలోని విద్యార్థుల సమస్యలను దృష్టిలో వుంచుకుని బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవన్న, ఉలిగప్ప, సోమశేఖరప్ప, నాగేంద్ర, నాగరాజుస్వామి, కుమార్, విరుపాక్షి, లింగయ్య, లక్ష్మణభండారి, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చిత్రలేఖనంలో రాణిస్తున్న బాలిక

- చేతులకు వేళ్లు లేకపోయినా దేవతా చిత్రాలను గీస్తున్న బాలిక



చిత్రలేఖనంలో నిమగ్నమైన సృష్టి

కంప్లి, ఫిబ్రవరి 23 : రామసాగర గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌గౌడ కుమార్తె సృష్టి అంగవికలాంగురాలైనా దీక్ష, పట్టుదల వుంటే దేనినైనా సాధించవచ్చునని నిరూపిస్తోంది. తమ ప్రాథమిక పాఠశాల నుంచి బీసీఏ 5వ సెమిస్టర్ చదువుతున్న బాలిక చిన్నతనం నుంచే చేతులకు వేళ్లు లేకపోయినా చిత్రలేఖనంలో రాణిస్తూ ప్రత్యేక గుర్తింపును పొందుతోంది. కంప్లి, జగలూరు, దావణగెరలో విద్యాభ్యాసం చేసిన ఆమె తాను ఖాళీగా వున్న సమయంలో గీసిన చిత్రాలను చూసి విద్యార్థులు, అధ్యాపకులను ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని మరికొంతమంది ముందడుగు వేస్తున్నారు. వినాయకుడు, దుర్గామాత తదితర చిత్రాలను వేస్తూ పూర్తిగా ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా తండ్రి చంద్రశేఖర్‌గౌడ మాట్లాడుతూ తమ కుమార్తె ఏ రంగంలో రాణిస్తుందో ఆ రంగంలో ఆమెనను ప్రోత్సహిస్తున్నామన్నారు. చిత్రలేఖనంలో రాణించాలంటే చాలా ఓపిక, పట్టుదల వుండాలని, కానీ తన కుమార్తె సృష్టి మాత్రం ఏకాగ్రతతో చిత్రలేఖనంలో రాణిస్తూ తామేమీ తక్కువ కాదంటూ గుర్తింపు పొందడం ఎంతో సంతోషించదగ్గ విషయమని తెలిపారు.



బాలిక చిత్రీకరించిన దుర్గామాత, వినాయకుడి చిత్రాలు

పశుగ్రాస బ్యాంకుకు అన్నీ అవరోధాలే!

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 23: జిల్లాలోని పశువుల కోసం పశుగ్రాసం బ్యాంకును ఏర్పాటు చేయాలనే తాలూకా పాలకవర్గం ప్రయత్నాలకు అవరోధాలు ఎదురవుతున్నాయి. పశుగ్రాసం కొరత, గిట్టుబాటుధర, రవాణా ఖర్చులు ఎక్కువగా ఉండడటంతో రైతులు పశుగ్రాసం విక్రయించేందుకు ఆసక్తి చూపడం లేదు. పశుగ్రాసం విక్రయించాలని కరువు నిర్వహణ కమిటీ మూడు నెలలుగా విన్నవిస్తున్నా రైతులు స్పందించడం లేదు. ఈ ఏడాది కరువు కారణంగా పశుగ్రాసం కొరత ఏర్పడింది. ప్రభుత్వం టన్ను పశుగ్రాసం ధరను రూ. 6000గా నిర్ణయించింది. రైతులు ట్రాక్టర్లు, లారీలు, ఎద్దుల బండ్లలో పశుగ్రాసాన్ని నింపి జిల్లాకేంద్రానికి అందించేలోపు రూ. 8వేలు ఖర్చవుతుంది. దీంతో రైతులు పశుగ్రాసం విక్రయించేందుకు వెనకంజ వేస్తున్నారు. ఇప్పుడు రైతుల వద్ద ఉన్న మినప పొట్టు, గడ్డి, మొక్కజొన్న, పప్పుధాన్యాల పశుగ్రాసం 12వారాలకు సరిపోతుందని, మే నెలలో పశుగ్రాసం కొరత సమస్యగా మారే అవకాశం ఉందని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శివకుమార్ జ్యోతి తెలిపారు. ఇది ఇలా ఉండగా, జిల్లాలో కరువు వలన రైతులు పశుగ్రాసం దొరకక పశువులను అతి తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. హరపనహళ్లి పట్టణంలోని ఆంజనేయులు మైదానంలో ప్రతి బుధవారం జరిగే పశువుల సంతలో తక్కువ ధరలకే ఎద్దులను విక్రయిస్తున్నారు. రైతులు బ్యాంకు రుణాలతో వివిధ ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన జెర్సీ ఆవులు, ఎద్దులు, గేదెలను అతి తక్కువ ధరకు విక్రయించడం ప్రారంభించారు. ప్రభుత్వం వెంటనే పశుగ్రాసం బ్యాంకులు, గోశాలలను ప్రారంభించాలని రైతు నవరరాజు, కొట్రేశ్, హాలప్ప కోరుతున్నారు.



కూడ్లిగి సంతలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పశువులు

3న చిన్నారులందరికీ పోలియో చుక్కలు

- జిల్లాపంచాయతీ సీఈఓ రాహుల్



బళ్లారి సిటీ, ఫిబ్రవరి 23: పిల్లలందరికీ మార్చి3న పోలియో చుక్కలు వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా పంచాయితీ సీఈఓ రాహుల్ శరణప్ప తెలిపారు. నగరంలోని జిల్లాకలెక్టరేట్ కార్యాయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పల్స్ పోలియో కార్యక్రమానికి అవసరమైన వాహనాలు సమకూర్చాలని రవాణాశాఖ అధికారులకు తెలిపారు. పల్స్ పోలియో వ్యాక్సిన్‌ను సురక్షితంగా ఉంచేందుకు నిరంతర విద్యుత్ అవసరమని, కోల్డ్ ఫ్యాక్‌లను సిద్ధం చేయాలని, మార్చి 1నుంచి 6వతేది వరకు పట్టణ, గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కేపీటీసీఎల్ అధికారులకు సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జాతా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ప్రయివేట్ పాఠశాలల్లో 5ఏళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించేలా తల్లి దండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈవిషయమై డీడీపీఐ, బీఈఓ చర్యలు తీసుకోవాలన్నారు. టీకాలు వేసే ప్రదేశం, తేదీని కరపత్రాల్లో ముద్రించి గ్రామ పంచాయితీ , పట్టణ పంచాయితీ , మున్సిపాలిటీ, నగర పాలక సంస్థల్లో ప్రచారం నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీకార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొనాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లలు, కార్మికుల పిల్లలు, మైనింగ్ కార్మికుల పిల్లలు, కంకర పగలగొట్టే వారి పిల్లలు, ఇతర వలస ప్రాంతాల్లోని 5సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించి టీకాలు వేయించాలని కార్మికశాఖ అధికారులకు సూచించారు. కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో 5సంవత్సరాల లోపు పిల్లలు 1,97,103 మంది ఉన్నారని, వీరిలో 72,631 మంది పట్టణాల్లో 1,24,472మంది గ్రామీణ ప్రాంతంలో ఉన్నారని, వీరందరికీ టీకాలు వేయడానికి గుర్తించామన్నారు. మొత్తం 968 వ్యాక్సినేషన్ బూత్‌లను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈసందర్భంగా జిల్లా సర్జన్ డాక్టర్ బసారెడ్డి, జిల్లాకుటుంబ సంక్షేమ అమలు అధికారి డాక్టర్ పూర్ణిమకట్టమణి, జిల్లాకుష్టువ్యాధి నిర్మూలన అధికారి వీరేంద్రకుమార్, జిల్లాసర్వే అధికారి మరియాంబి, ఆయుష్ అధికారిణి సుజాత, జిల్లావిద్యాశాఖాధికారి ఈశ్వర దాసప్పనవర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులను స్వేచ్ఛగా నిర్వహించాలి : కలెక్టర్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 23: రానున్న లోకసభ ఎన్నికలను స్వేచ్ఛగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అధికారులను ఆదేశించారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి గురువారం సాయంకాలం నగరంలోని కలెక్టరేట్ కార్యాలయం హాల్లో వివిధ నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బళ్లారి లోక్‌సభ నియోజకవర్గంలో మొత్తం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. ఇందులో బళ్లారి జిల్లాలో నాలుగు, విజయనగరం జిల్లాలో 4 నియోజకవర్గాలు ఉండగా, సిరుగుప్ప నియోజకవర్గం కొప్పళ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోకి వెళతుందన్నారు. ఎన్నికలను విజయవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన సన్నాహాలు వెంటనే చేపట్టాలన్నారు. టీమ్‌గా పని చేసి ఎన్నికల విధులను విజయవంతం చేసేందుకు అందరి సహకారం అవసరమన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అవసరమైన సన్నాహాలు చేస్తోందన్నారు. ప్రతి అధికారి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి అధికారి తనకు అప్పగించిన ఎన్నికల విధుల్లో బాధ్యతలు అర్థం చేసుకుని విధులు నిర్వహించాలన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌లను తనిఖీ చేయాలన్నారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రంజిత్ కుమార్ బండారు మాట్లాడుతూ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు కేటాయించిన పోలీసు శాఖ అధికారులు , సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. అలాగే సెన్సిటివ్ పోలింగ్ స్టేషన్ల గుర్తింపు కూడా చేపడుతున్నామన్నారు. జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే తమకు సమాచారం అందించాలని కలెక్టర్‌కు సూచించారు. సమావేశంలో జిల్లాస్వీప్ కమిటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప సంకనూర్, అదనపు జిల్లాకలెక్టర్ మహ్మద్ జుబేరా ,అసిస్టెంట్ కమిషనర్ హేమంత్, ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

న్యాయం లభించే వరకు పోరాటం :సీఐటీయూ



మాట్లాడుతున్న సత్తిబాబు

కంప్లి, ఫిబ్రవరి 23 : ఫ్యాక్టరీల కోసం భూములు పోగొట్టుకున్న రైతులు న్యాయం లభించే వరకు పోరాడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు పిలుపునిచ్చారు. కుడితిని పట్టణంలో రైతులు చేపట్టిన నిరసన కార్యక్రమం 432వ రోజుకు చేరుకున్నసందర్భంగా ఆయన వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం బళ్లారి ఐబీలో మాజీ ఎంపీ ఉగ్రప్ప నేతృత్వంలో సమావేశం ఏర్పాటు చేశామని, అందులో భూములు పోగొట్టుకున్న రైతులు, సంఘ సంస్థ నేతలు, భూపోరాట సభ్యులు పాల్గొనాలని సూచించారు.

హోసూరు జోన్

ఆహార అధికారుల తనిఖీల్లో కల్తీ నిర్ధారణ



ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న అధికారులు

హోసూరు(క్రైం), ఫిబ్రవరి 23 : తళి, బేలగొండపల్లి, హోసూరు టౌన్, బాగలూరు రోడ్డు బజారు ఏరియా, హోసూరు బస్టాండులోని బేకరీలు, స్వీట్స్ దుకాణాలు, హోటళ్లలో అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ అనలిస్ట్ కార్తికేయ స్థానిక ఫుడ్ అనాలిసిస్ లేబోరేటరీలో వ్యాపారులు, ప్రజల సమక్షంలో ఆహార పదార్థాలను విశ్లేషించారు. వంటనూనె, టీపొడి, పాలు, చిప్స్, కలర్ మిఠాయిలు, తదితర వాటిల్లో కల్తీ జరిగినట్లు నిర్ధారించారు. ఆ ఉత్పత్తులను సరఫరా చేసిన కంపెనీలకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కాగా మోర్నపల్లి హైస్కూల్, బెలగొండపల్లి ఉన్నత పాఠశాల, లైలాండ్ పాఠశాలలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహార పదార్థాల్లో కల్తీని గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుమారు 500 మంది పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ అధికారి, సేలం ప్రభుత్వ ఫుడ్ అనలిస్ట్ నరసింహన్, హోసూరు ఫుడ్ సేఫ్టీ అధికారి ముత్తుమారియప్పన్ హోసూరు కన్స్యూమర్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ సభ్యులు నంబి, అక్కన్న తదితరులు పాల్గొన్నారు.

మామిడి దిగుబడికి సరైన సలహాలివ్వండి

హోసూరు, ఫిబ్రవరి 23: కృష్ణగిరి జిల్లాలో సుమారు 50 వేల ఎకరాల్లో మామిడి సాగు అవుతుండగా హోసూరు, బాగలూరు, శూలగిరి ప్రాంతాలలో రైతులు నీలం, బెంగళూరు, సెందూర, చిలుక ముక్కు, నాటు మామిడి వంటి రకాలను మామిడి పండిస్తున్నారు. ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడంతో మామిడి చెట్లు విపరీతంగా పూత పూస్తున్నాయి. ఈ పూత మంచు ప్రభావానికి, ఎండ తీవ్రతకు ఎండిపోతోంది. ఇలాగైతే మామిడి దిగుబడి కష్టమవుతుందని, దీన్ని నియంత్రించేందుకు అధికారులు సరైన సలహా సూచనలు అందజేయాలని రైతులు కోరుతున్నారు. తమను ఆదుకోవడానికి వ్యవసాయశాఖ చర్యలు తీసుకోవాలని మామిడి రైతులు కోరుతున్నారు.

ఆలయంలో నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన

హోసూరు(మత్తిగిరి), ఫిబ్రవరి 23: హోసూరు సమీపంలోని మత్తిగిరిలో ప్రసిద్ధి చెందిన శివభద్రకాళీ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. ప్రధాన అర్చకుడు కిషోర్ స్వామీజీ నేతృత్వంలో ధార్మిక కైంకర్యాలు జరిగాయి. వేద పండితులు శ్రీనివాసకుమార్ శర్మ, యశ్వంత్ బృందం, విజయవాడ నుంచి వచ్చిన రుత్వికులు ఈ పూజలను నిర్వహించారు. శుక్రవారం ఉదయం పుణ్యాహవాచనం, వాస్తుహోమం, బింబశుద్ధి, ప్రసాద శుద్ధి, కాలభైరవ, గణపతి, సుబ్రమణ్య విగ్రహాలకు ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో హోసూరు ప్రాంతానికి చెందిన వెయ్యి మందికి పైగా భక్తులు పాల్గొని దర్శనం చేసుకున్నారు.



ప్రతిష్ఠాహోమంలో పాల్గొన్న భక్తులు

శక్తి పథకం తెచ్చిన తంటా..!

- నలుగురు బాలికల అదృశ్యం
- మౌనేశ్వర జాతరలో గుర్తింపు

రాయచూరు, ఫిబ్రవరి 23 : జిల్లాలోని లింగసుగూరు తాలూకా యరగుంటికి చెందిన నలుగురు మైనర్ బాలికలు ఒకే సారి అదృశ్యం కావడం సంచలనంగా మారింది. గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన ఈ నలుగురు పిల్లలు సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. బాలికలు పక్క పక్క ఇళ్ల వారే కావడంతో అందరూ కలిసి మాట్లాడుకుని వెళ్లారా..? లేకా ఎవరికి వారే వెళ్లారా..? అన్నదానిపై సందేహాలు నెలకొన్నాయి.

ఇంట్లో తల్లిదండ్రులు ఇచ్చిన సమాచారం మేరకు ఆ నలుగురు కూడా తమ వెంట ఆధార్ కార్డులను తీసుకెళ్లారని తెలియడంతో వారు ఎక్కడికి వెళ్లారన్నదానిపై పోలీసులు సమీపంలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం ఇచ్చి దర్యాప్తు ప్రారంభించారు. లింగసుగూరుతో పాటు చుట్టుపక్కల పట్టణాలు, గ్రామాల్లో ఒకే సారి దర్యాప్తు ప్రారంభించారు. చివరికి పోలీసులు వారిని శుక్రవారం తింథిణిబ్రిడ్జి సమీపంలోని మౌనేశ్వర జాతరలో గుర్తించారు. జాతరలో దేవాలయం వద్ద ఒకే చోట నలుగురు బాలికలు కూర్చుని ఉండగా అనుమానం వచ్చిన పోలీసులు వారి పేర్లను విచారించగా విషయం అర్థమైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఫ్రీ బస్‌పాస్ పథకంతోనే ఈ తంటా వచ్చినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా ఈ నలుగురు బాలికలను లింగసుగూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లిన పోలీసులు వారిని తల్లిదండ్రులకు అప్పగించారు.

గ్రామీణ బ్యాంక్ ఉద్యోగుల ధర్నా



వెస్ట్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగిన బ్యాంకు ఉద్యోగులు

రాయచూరు, ఫిబ్రవరి 23 : తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. గత కొంత కాలంగా తాము చేస్తున్న ఆందోళన పట్ల యాజమాన్యం ఉదాసీనంగా ఉండడంతో వారు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. నగరంలోని వెస్ట్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగిన గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులు వివిధ విభాగాల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. గ్రామీణ బ్యాంకుల్లో పని చేసే ఉద్యోగులకు సహితం జాతీయ బ్యాంకు నియమాలను వర్తింప చేస్తూ వేతనాలు ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా బ్యాంకుల్లో విధులు నిర్వహిస్తున్న తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేసి కనీస వేతనం ఇవ్వాలన్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

పిలకా గణపతి శాస్త్రి (జయంతి)



ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పిలకా గణపతి శాస్త్రి 1911 ఫిబ్రవరి 24న తూర్పుగోదావరి జిల్లా కట్టుంగ గ్రామంలో జన్మించారు. కవి, వ్యాఖ్యాత, నవలా రచయిత, అనువాద కుడు, ఆర్ష విద్వాంసులు, పత్రికా సంపాదకులుగా రాణించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. రాజమహేంద్రవరం ఆంధ్ర యువతీ సంస్కృత పాఠశాలలోనూ, వీరేశలింగం పాఠశాలలోనూ తెలుగు పండితులుగా పనిచేశారు. ఆంధ్ర శిల్పి, ఆంధ్రభారతి, ఆంధ్రప్రభ తదితర పత్రికలకు సహాయ సంపాదకులుగా వ్యవహరించారు. 1983 జనవరి 2న కన్నుమూశారు.

తలత్ మహమూద్ (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత తలత్ మహమూద్ 1924 ఫిబ్రవరి 24న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లఖ్నవ్‌లో జన్మించారు. సినీ నేపథ్య గాయకుడు, గజల్ ఆలాపనలో పేరొందారు. 1940 నుంచి 1980 వరకు 12 భాషలలో 750 పాటలు పాడారు. అంతేకాక 12కుపైగా సినిమాలలో నటించారు. తూర్పు ఆఫ్రికా, యునైటెడ్ స్టేట్స్, యూకే, వెస్ట్ ఇండీస్ తదితర దేశాలలో పర్యటించిన తొలి భారత గాయకుడు. లండన్‌లోని రాయల్ అల్బర్ట్ హాల్‌లోనూ ప్రదర్శన ఇచ్చారు. 1998 మే 9న కన్నుమూశారు.

డాక్టర్ ఎస్ఎస్ బద్రీనాథ్ (జయంతి)



దేశంలో పేరొందిన కంటి ఆసుపత్రి శంకర నేత్రాలయ సంస్థాపకులు, ఛైర్మన్, 'పద్మభూషణ్' గ్రహీత సెంగమేడు శ్రీనివాస బద్రీనాథ్ 1940 ఫిబ్రవరి 24న చెన్నైలో జన్మించారు. నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లోనూ క్రియాశీలకంగా వ్యవహరించారు. మానవతా దృక్పథంతో పలు వైద్య పరిశోధనలు చేసి ఫౌండేషన్ ద్వారా ఉచిత వైద్య సేవలందిస్తున్నారు. అంతేకాకుండా ఆప్తల్మాలజీలో గ్రాడ్యుయేట్‌లకు తర్ఫీదు ఇస్తున్నారు. 2023 నవంబరు 21న కన్నుమూశారు.

జయలలిత (జయంతి)



తమిళనాట అభిమానులచే అమ్మ, 'పురచ్చి తలైవి' (విప్లవ నాయకురాలు)గా పేరొందిన జయరాం జయలలిత 1948 ఫిబ్రవరి 24న మైసూరు ప్రాంతంలో జన్మించారు. సినీ నటిగా రాజకీయ నాయకురాలిగా రాణించారు. 1991 నుంచి 2016 వరకు తమిళనాడు ముఖ్యమంత్రిగా కొన సాగారు. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో 140 సిని మాలలో నటించారు. తమిళ చిత్రసీమలో మకుటం లేని మహారాణిగా నిలిచారు. అనంతరం రాజకీయాల్లో రాణించి ఏఐఏడీఎంకే పార్టీ జనరల్ సెక్రటరీగా వ్యవహరించారు. అనారోగ్యంతో 2016 డిసెంబరు 5న కన్నుమూశారు.

స్టీవ్ జాబ్స్ (జయంతి)



ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ యాపిల్ సంస్థ సహ సంస్థాపకులు, ఛైర్మన్ అండ్ సీఈఓ అయిన స్టీవ్‌జాబ్స్ 1955 ఫిబ్రవరి 24న అమెరికాలోని కాలిఫోర్నియాలో జన్మించారు. వ్యాపారవేత్త, పెట్టుబడిదారుడు. పర్సనల్ కంప్యూటర్‌ను ప్రజలందరికీ చేరువ చేయడంలో కీలకంగా వ్యవహరించారు. ఐమ్యాక్, ఐట్యూన్స్ ఐపాడ్, ఐఫోన్, యాప్ స్టోర్‌లను అభివృద్ధి చేశారు. నేషనల్ మెడల్ ఆఫ్ టెక్నాలజీ తదితర పురస్కారాలు పొందారు. 2011 అక్టోబరు 5న కన్నుమూశారు.

ముళ్లపూడి వెంకటరమణ (వర్ధంతి)



ముళ్ళపూడి వెంకటరమణ 1931 జూన్ 28న ధవళేశ్వరంలో జన్మించారు. తెలుగు రచయిత. నవలలు, కథలు, సినిమా కథలు, హాస్యకథలు రాశారు. ప్రధానంగా హాస్యరచనలతో పేరొందారు. తెలుగు సాహిత్యంలో 'బుడుగు' ఎంతో పేరొందింది. ఆయన రచనలకు ప్రఖ్యాత చిత్రకారుడు బాపు సహకారం అందించారు. బాపు సినిమాలకు రమణ రచనలు చేసి 'బాపు-రమణ' జంటగా పేరొందారు. ఆయన ఆత్మకథ 'కోతికొమ్మచ్చి' పుస్తకరూపంలో వెలువడింది. రాజాలక్ష్మీ సాహిత్య పురస్కారం పొందారు. 2011 ఫిబ్రవరి 24న కన్నుమూశారు.

సంజయ్‌లీలా భన్సాలీ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత సంజయ్‌లీలా భన్సాలీ 1963 ఫిబ్రవరి 24న ముంబైలో జన్మించారు. బాలీవుడ్‌లో దర్శకుడు, నిర్మాత, స్క్రీన్‌రైటర్, సంగీత దర్శకుడిగా రాణించి బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరొందారు. 7 జాతీయ, 12 ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు పొందారు. 2002లో రూపొందించిన దేవదాస్ సినిమా బాఫ్టాకు నామినేట్ అయింది. పలుమార్లు ఉత్తమ దర్శకుడి పురస్కారం అందుకున్నారు.

పాలసంఘానికి కొత్త డైరెక్టర్లు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 23: తాలూకాలోని శీగెహళ్ళి గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి 11మంది డైరెక్టర్‌లు జేడీఎస్ మద్దతుదారులు గెలుపొందారు. శ్రీనివాస రెడ్డి, రాజణ్ణ, శ్రీరామ్‌రెడ్డి, ద్యావప్ప, ఎంఎస్ రమేశ్, రాజేశ్, హెచ్ అశ్వత్థమ్మ, రూప మునిలక్ష్మమ్మ, వేణుగోపాల్, ఎస్‌డీ బోవి శ్రీనివాస్, చంద్రణ్ణలు నూతన డైరెక్టర్‌లుగా నిలిచారు. వీరంతా ఎమ్మెల్యే బీఎస్ రవి కుమార్‌ను ఆత్మీయంగా కలసి తమ విజయానికి సహకరించినందుకు కృత జ్ఞతలు తెలిపారు. కాగా సంఘాన్ని ఉత్తమంగా నిర్వహించి పాడిరైతులకు అండగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. నూతన డైరెక్టర్‌లను ఆత్మీయంగా సత్కరించారు.

జియో స్పేసియల్ సాంకేతికత భావితరాలకు అవసరం

▸▸ ఇస్రో మాజీ ఛైర్మన్ కిరణ్‌కుమార్



సమావేశంలో పాల్గొన్న ఇస్రో మాజీ ఛైర్మన్ కిరణ్‌కుమార్ తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జియో స్పేసియల్ సాంకేతికత దైనందిన జీవనంలో ఎంతో ప్రయోజనకరమని భావితరాలకు ఇది అవసరం కానుందని ఇస్రో మాజీ ఛైర్మన్ కిరణ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. జియో స్పేసియల్ టెక్నాలజీకి మాస్టర్ మెంటార్స్ జియో ఎనేబ్లింగ్ ఇండియన్ స్కాలర్స్ (ఎంఎంజీఈఐఎస్) ను శుక్రవారం లాంఛనంగా ఆరంభించారు. పైలట్ ప్రాజెక్ట్‌గా ఆరంభమవుతున్నా భవిష్యత్తులో అన్ని ప్రాంతాల్లోనూ అందుబాటులోకి రావాలని అభిప్రాయపడ్డారు. 2022లో 66,400కుపైగా పేటెంట్ అర్జీలు దేశంలో సమర్పించగా కేవలం 140 మాత్రమే జియో స్పేసియల్ టెక్నాలజీకి సంబంధించినవి ఉన్నాయన్నారు. ఎంఎంజీఈఐఎస్ పైలట్ ప్రాజెక్ట్ గురించి ఎస్రీ సంస్థ ఎండీ అగేంద్రకుమార్ మాట్లాడుతూ నాలుగు నెలల క్రితమే ప్రారంభించామని 8-12 తరగతుల విద్యార్థులకు ఉచితంగా అందుబాటులో ఉంటుందన్నారు. జూన్ నుంచి ప్రాజెక్ట్ విస్తరిస్తామని ఐదేళ్లలో 5లక్షలమందికి జియో స్పేషియల్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. సెంటర్ ఫర్ నాలెడ్జ్ సావరెనిటీ కార్యదర్శి వినీత్ గోయెంకా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 10 నగరాలకు చెందిన 42మంది విద్యార్థులు బెంగళూరులోని ఇస్రో టెలిమెట్రీ ట్రాకింగ్ కమాండ్ నెట్‌వర్క్ (ఇస్ట్రాక్)ను సందర్శించారన్నారు. కార్యక్రమంలో వాతావరణ పరిశోధనా విభాగం ఎండీ డాక్టర్ కేజే రమేశ్, మాజీ సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా లే జా గిరీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాటరీటౌన్ మెట్రో స్టేషన్‌కు పునీత్ పేరు పెట్టాలి

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు పులకేశినగర విధానసభా నియోజకవర్గంలో పాటరీ టౌన్- ఫెడర్‌లైట్ పాఠశాల మధ్య ఉన్న అండర్‌గ్రౌండ్ పాటరీ టౌన్ మెట్రోరైలు స్టేషన్‌కు కర్ణాటక రత్న డా.పునీత్ రాజ్‌కుమార్ పేరు పెట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సిఫార్సు చేయాలని కర్ణాటక బహుజన ఫెడరేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు నగరంలో శుక్రవారం బెంగళూరు దక్షిణ లోకసభ సభ్యుడు తేజస్విసూర్యకు ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ జీహెచ్ శంకర్ ఒక వినతి పత్రాన్ని అందజేశారు. డా.పునీత్ రాజ్‌కుమార్ చేసిన సామాజిక సేవలను గుర్తించి ఆయనకు ఘన నివాళి అర్పించేందుకు ఇది ఉత్తమ మార్గమన్నారు. వినతిపత్రాన్ని స్వీకరించిన అనంతరం ఎంపీ తేజస్వి సూర్య సానుకూలంగా స్పందించారని ఫెడరేషన్ అధ్యక్షుడు శంకర్ తెలిపారు. గత కొద్దికాలంగా అనేక మంది ప్రముఖ నేతలను కలిసి ఈ మేరకు వినతి పత్రాలను అందజేస్తూ వస్తున్నామని తమ సంకల్పం నెరవేరుతుందన్న నమ్మకం ఉందని శంకర్ పేర్కొన్నారు. అమలైతే డాక్టర్ పునీత్ పేరుకు సార్థకత రానుందన్నారు.



ఎంపీకి వినతి పత్రం అందజేత

హ్యాకథాన్‌తో విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు



హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థుల బృందంతో ప్రొఫెసర్లు

బెంగళూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు హ్యాకథాన్‌లో పాల్గొనడం ద్వారా కొత్త ఆలోచనలు సాధ్యమవుతాయని పీఈఎస్ ప్రొ-చాన్స్‌లర్ ప్రొఫెసర్ జవహర్ అభిప్రాయపడ్డారు. పీఈఎస్ యూనివర్సిటీలో హెల్త్ హ్యాక్ 2.0 అనే పోటీని ఏర్పాటు చేశారు. 24 గంటలపాటు సాగిన హ్యాకథాన్‌కు 30 బృందాలు భాగస్వామ్యులయ్యాయి. స్టూడెంట్ లీడర్‌లు ప్రియాన్షు అగర్వాల్, రచిత్ సింగ్లా నేతృత్వంలో హ్యాకథాన్ సాగింది. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 8వ సెమిస్టర్ విద్యార్థులు విష్ణు భరద్వాజ్, నవ్యతాయి, శుభల బృందం ప్రథమ బహుమతి సాధించింది. గాయపడిన అవయవాలు వేగవంతంగా కోలుకునేలాంటి పరికరాన్ని ప్రదర్శించారు. నందితా, కీర్తి, అభిస్థిత, లక్ష్మీశెట్టర్, స్ఫూర్తిల బృందం స్మార్ట్ వాచీ ద్వారా ఎస్ఓఎస్ బటన్‌ను అభివృద్ధి చేశారు. ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనేవేళ డాక్టర్‌లు, రోగుల కుటుంబాల మధ్య సమన్వయం చేసేలాంటి పరికరంగా ఉంది. ఆయుష్ మిత్రా, అభిరా ప్రసన్న, అసిత్ శర్మ, దివ్యాంశుశర్మల బృందం ఆడియో వీడియోల ద్వారా పాఠ్యపుస్తకాలు, ప్రశ్నాపత్రాల ఆధారంగా పరీక్షల్లో ఎలా పాల్గొనాలనే అంశంపై ప్రత్యేక విధానాన్ని రూపొందించారు. విజేత బృందానికి పీఈఎస్ యనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి ప్రత్యేకంగా అభినందించారు.

ఉత్సాహంగా జాగృతి జాతా

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 23: తాలూకాలోని మూడు గ్రామ పంచాయతీలలో రాజ్యాంగ జాథా ఉత్సాహంగా సాగింది. సాదలి హోబళిలోని దిబ్బూరహళ్ళిలోనూ రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. తలకాయలబెట్ట గ్రామ పంచాయతీలోనూ, ఈ తిమ్మసంద్ర గ్రామపంచాయతీలోనూ గురువారం జాగృతి జాథా జరిగింది. సాంఘిక సంక్షేమశాఖ సహాయక డైరెక్టర్ జగదీశ్ మాట్లాడుతూ సమానత్వం, భాతృత్వం, జాతీయతను పెంచడంలో రాజ్యాంగ పాత్ర కీలకమన్నారు. రాజ్యాంగం యొక్క గొప్పదనాన్ని తెలిపేలా రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. భిన్నత్వంలో ఏకత్వం కల్గిన ప్రజాప్రభుత్వమన్నారు. సమాజంలోని అన్నివర్గాల అభ్యున్నతిని కాంక్షించేలా రాజ్యాంగం రూపొందించబడిందన్నారు. జిల్లా దళిత నాయకుడు వెంకటేశ్ మాట్లాడుతూ రాజ్యాంగంపట్ల ఉన్న అపోహలను తొలగించడమే జాథా ఉద్దేశ్యమన్నారు. మహిళలు పూర్ణకుంభాలతో, పాఠశాల విద్యార్థులు వివిధ వేషధారణలతో జాథాలో పాల్గొన్నారు. దిబ్బూరహళ్ళి గ్రామపంచాయతీ అధ్యక్షురాలు వెంకటలక్ష్మమ్మ, ఉపాధ్యక్షురాలు అనురాధ, సభ్యులు డీపీ నాగరాజ్, ధనంజయ్‌రెడ్డి, వైద్యాధికారి యశ్వంత్, పీడీఓ రమేశ్, తలకాయలబెట్ట గ్రామపంచాయతీ అధ్యక్షుడు టీఎస్ వెంకటస్వామి, ఉపాధ్యక్షురాలు శుభవతమ్మ, అశ్వతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

గనుల అక్రమార్కుల నుంచి నిత్యం బెదిరింపులు

▸▸ ఎంపీ సుమలత

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండ్య జిల్లాలో ప్రత్యేకించి కావేరీ నదికి అనుబంధంగా ఉండే కేఆర్ఎస్ జలాశయం పరిసర ప్రాంతాలలో గనుల తవ్వకాలపై పోరాటం చేసినందుకు నిత్యం అక్రమార్కుల నుంచి బెదరింపులు వస్తున్నాయని మండ్య ఎంపీ సుమలతా అభిప్రాయపడ్డారు. మండ్యలో గురువారం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ అక్రమంగా సాగుతున్న గనుల తవ్వకాలపై పోరాటం చేయడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. పోరాటాలు చేస్తున్నాననే నిరంతరంగా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. శ్రీరంగపట్టణ తాలూకా కేఆర్ఎస్ జలాశయం 20 కిలోమీటర్‌ల పరిధిలో ఎటువంటి తవ్వకాలు జరుపరాదని హైకోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసిందన్నారు. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించామన్నారు. జలాశయం బ్యాక్‌వాటర్ ప్రాంతంలో మట్టి తవ్వకాలు, పూడిక పనులు జరిగితే కేసులు నమోదు చేయిస్తామన్నారు. బెదరింపులు వచ్చినంత మాత్రాన వెనకడుగు వేసేది లేదన్నారు. ప్రజాజీవితంలో ఇటువంటి హెచ్చరికలకు భయపడేది లేదన్నారు.

రెహావు చేతికి రెడ్‌స్టార్

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): విలాసవంతమైన ఫర్నీచర్స్‌తో పాటు పరిశ్రమలకు అవసరమైన పరిక రాలను సమకూర్చే ప్రముఖ రెహావు సంస్థ ఎడ్జ్‌బాండ్ ఉత్పత్తి చేసే రెడ్‌స్టార్‌ను స్వాధీనం చేసుకుంది. ఈమేరకు నగరంలో గురువారం ప్రత్యేక ఒప్పందం కుదిరింది. రెహావు ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఫైజ్‌అహ్మద్ రెడ్‌స్టార్ పాలిమర్స్ ముఖ్యులు కార్తికేయన్‌లు ఒప్పందం చేసుకున్నారు. దేశంలో ఫర్నీచర్స్ రంగంలో సమిష్టిగా అభివృద్ధి సాధించాలనే నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇదే సందర్భంలోనే రెహావు స్ట్రాటజిక్ ప్రాజెక్టు వైస్‌ప్రెసిడెంట్ లక్ష్మీపచా మాట్లాడుతూ 75 వార్షికోత్సవం వేళ కొత్త అడుగులు వేశామన్నారు.

రేపటి నుంచి లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు సప్తగిరినగర ముద్దినపాళ్యలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి 18వ వార్షిక బ్రహ్మరథోత్సవం ఈ నెల 25న ప్రారంభం కానుంది. ఆలయానికి చెందిన ప్రధాన ఆగమికులు డా. వేణుగోపాల భట్టర్, ప్రధాన అర్చకుడు మధుసూధన్ భట్టర్ నగరంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 25న ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం, సాయంత్రం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కాగా 26న ఉదయం కళశారాధన, మూర్తి హోమం జరుగుతాయన్నారు. 27న సాయంత్రం గరుడ వాహనోత్సవం, 28న సామూహిక కల్యాణోత్సవం, 29న మధ్యాహ్నం లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం, మార్చి 1న వసంతోత్సవం జరుగుతాయన్నారు. మార్చి 2న ఉదయం గోపూజ సేవలతో ఉత్సవాలకు ముగింపు ఉంటుందన్నారు.

మైకో లే అవుట్‌లో అణ్ణమ్మదేవి ఉత్సవం



కళశాలతో మహిళలు

బొమ్మనహళ్ళి, ఫిబ్రవరి 23: బేగూరు సమీపానగల మైకో లే అవుట్‌లో గ్రామదేవత అణ్ణమ్మదేవి ఉత్సవం శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. సుమారు 50మందికిపైగా మహిళలు కళశాలతో అమ్మవారిని స్వాగతించారు. ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా శని, ఆదివారాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆర్కెస్ట్రా, అతిథులకు సన్మానం, ముగింపున పురవీధులలో అమ్మవారిని ఊరేగింపు, భారీ అన్నసంతర్పణ చేయనున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సన్నాహక సమావేశం

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 23: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సంఘం మహాసమ్మేళనం ఈనెల 27న బెంగళూరు ప్యాలెస్ మైదానంలో జరగనున్న నేపథ్యంలో తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సన్నాహకసభ నిర్వహించింది. పట్టణంలోని నౌకరర భవన్‌లో ఏర్పాటైన సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా వందకుపైగా సంఘాలు సమ్మేళనానికి పిలుపునిచ్చాయన్నారు. ఉద్యోగులతోపాటు రిటైర్డు ఉద్యోగులు కూడా పెద్దసంఖ్యలో పాల్గొనేలా బస్సు, అల్పాహార వ్యవస్థ కల్పించినట్టు తెలిపారు. ఉదయం 7 గంటలకు బీఈఓ కార్యాలయం నుంచి బస్సులు బయల్దేరుతాయన్నారు. 7వ వేతన కమిషన్ నివేదిక సాధ్యమైనంత త్వరగా అమలు చేయాలని, పాత పింఛను వ్యవస్థ పునరుద్ధరించాలని, ఆరోగ్య సంజీవిని క్యాష్‌లెస్ ఉచిత చికిత్స పథకాన్ని అమలు చేయాలని తదితర డిమాండ్లు ప్రధానంగా ఉన్నాయన్నారు. తాలూకా హైస్కూల్ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఎల్‌వీ వెంకటరెడ్డి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు బీఆర్ నారాయణస్వామి, మాజీ అధ్యక్షుడు సీఎం మునిరాజు, రిటైర్డు ఉద్యోగుల సంఘం గురురాజు, జయరాం, ఉద్యోగుల సంఘం దేవరాజు, అక్కలరెడ్డి, నరసింహప్ప, కెంపేగౌడ, తాలూకా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు శివశంకర్, ఎస్‌పీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సవితా మహర్షి జయంతి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నారాయణస్వామి

బంగారపేట, ఫిబ్రవరి 23: తాలూకా సవితా మహర్షి సమాజ సంఘం ఆధ్వర్యంలో సవితా మహర్షి జయియంతి, సద్గురు త్యాగరాజ, పురందరదాస ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నారాయణస్వామి పాల్గొని మహర్షుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. సవితా మహర్షి జయంతి ద్వారా తక్కువ జనాభా కల్గిన సవితా సామాజికవర్గం బలోపేతం కావడానికి విద్యాపరంగా అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. సామవేదం సృష్టికర్తగా సవితా మహర్షి చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా సవితాసమాజ సంఘం డైరెక్టర్ ఆనంద్, తాలూకా అధ్యక్షుడు నారాయణస్వామి, పురసభ సభ్యులు ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు మునిరాజు, సవితా సమాజ నాయకులు నాగరాజ్, కేశవప్ప, వెంకటేశప్ప, రామప్ప, శివకుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బెంగళూరు ప్యాలెస్‌లో జాతీయ ఐక్యతా సమావేశం

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జాతీయ ఐక్యతా సమావేశం బెంగళూరు ప్యాలెస్ మైదానంలోని త్రిపుర వాసినిలో శనివారం ఉదయం 10 గంటలకు జరుగనుంది. ఈ మేరకు ప్రభుత్వం నగరంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ఐక్యతా సమావేశాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రారంభించనుండగా, గౌరవ అతిథులుగా కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి ప్రహ్లాద్‌జోషి, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలు హాజరు కానున్నారు. రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్రమంత్రులతో పాటుశాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్, విధానపరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి సమావేశంలో పాల్గొంటారని ప్రకటన పేర్కొంది. ఈ సమావేశానికి మల్లేశ్వరం ఎమ్మెల్యే డాక్టర్ సీఎన్ అశ్వత్థనారాయణ అధ్యక్షత వహించనున్నారు.

నేడు కోదండరామస్వామి బ్రహ్మరథోత్సవం

దొమ్మసంద్ర, ఫిబ్రవరి 23: ఆనేకల్ తాలూకా సర్జాపుర గ్రామంలోని చరిత్ర ప్రసిద్ధి చెందిన కల్యాణ కోదండరామస్వామి బ్రహ్మరథోత్సవం శనివారం జరగనుంది. ఇందుకు సంబంధించి ఆలయ ధర్మకర్తమండలి పదాధికారులు కరపత్రాలను విడుదల చేశారు. సర్జాపుర గ్రామపంచాయతీ సభ్యుడు అనిల్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 24న గురువులు, పెద్దలు నిర్ణయించిన ముహూర్తంలో స్వామి వారి బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉదయం పీఠోత్సవం, మధ్యాహ్నం హంసవాహనోత్సవం, రథ కళశపూజ, సాయంత్రం గజేంద్ర మోక్షోత్సవం, కాశియాత్ర సేవ, రాత్రి కళ్యాణోత్సవం, గజవాహనోత్సవం ఉంటాయన్నారు. లలితా సహస్ర నామపారాయణ, ఆస్థాన సేవలు ఉంటాయన్నారు. మఖ నక్షత్రంలో బ్రహ్మ రథోత్సవం కొనసాగుతుందన్నారు. సర్జాపుర బస్టాండ్ సమీపంలో ప్రసన్న వెంకటరమణ అన్నదాన సేవా సమితి, అయ్యప్పస్వామి భక్తులచే జై భువనేశ్వరి గ్రామీణాభివృద్ధి కన్నడ యువజనసంఘం, హిందూసేవా సమితి ఆధ్వర్యంలో అన్న సంతర్పణ ఉంటుందన్నారు. సర్జాపుర సిటిజన్ ఫర్ ఫోరం అధ్యక్షుడు ఎస్‌వీ భరత్ గౌడ మాట్లాడుతూ రథోత్సవంలో భాగంగా సర్జాపురలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ క్రీడామైదానంలో శనిదేవర కృపాపోషిత నాటకమండలి ఆధ్వర్యంలో దానవీర శూరకర్ణ పౌరాణిక నాటకం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కుమార్ గౌడయర బళగ ఆధ్వర్యంలో వాద్యగోష్టి, వహ్నికుల సామాజికవర్గీయులచే ముత్యాలమ్మదేవి కరగ మహోత్సవం, గ్రామస్థులచే పల్లకీ ఉత్సవం ఉంటాయన్నారు.

ఎమ్మెల్యే బీఆర్ పాటిల్‌కు శాంతవేరి పురస్కారం



బీఆర్ పాటిల్

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కన్నడ జనశక్తి కేంద్రం ఇచ్చే ప్రతిష్టాత్మక శాంతవేరి గోపాలగౌడ సంస్కృతి పురస్కారం కోసం ఆళంద ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి సలహాదారుడిగా ఉన్న బీఆర్ పాటిల్ ఎన్నికయ్యారు. ఈ పురస్కారం కింద రూ.25వేల నగదు, ప్రశంసా పత్రం, కంచుఫలకం అందజేయనున్నారు. మార్చి 14న బెంగళూరు కన్నడభవన్‌లోని నయన సభాభవనంలో జరిగే కార్యక్రమంలో లోకాయుక్త మాజీ న్యాయమూర్తి ఎన్ సంతోష్ హెగ్డే పురస్కారాన్ని ప్రదానం చేయనుండగా, హంపి కన్నడ విశ్వవిద్యాలయం రిటైర్డ్ వీసీ పీజీ బోరలింగయ్య అధ్యక్షత వహించనున్నారు. ఈ మేరకు కన్నడ జనశక్తి కేంద్ర అధ్యక్షుడు సీకే రామెగౌడ నగరంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బైజూస్ రవీంద్రన్‌కు మరో కష్టం

▸▸ బయటకు పంపేలా భాగస్వాముల డిమాండ్

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ద్వారా విద్యాబోధన అందించే బైజూస్ సంస్థ నష్టాలబాటలో నడుస్తోంది. ఇప్పటికే బెంగళూరులోని కార్యాలయాన్ని ఖాళీ చేసిన విషయం తెలిసిందే. బైజూస్ కంపెనీ ఫౌండర్, సీఈఓ బైజూ రవీంద్రన్ చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. శుక్రవారం బెంగళూరులో జరిగిన బైజూస్ సంస్థ కీలక సమావేశంలో నలుగురు భాగస్వాములు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. రవీంద్రన్ సమావేశానికి హాజరు కాకపోవడంపై వారు మండిపడ్డారు. సంస్థను నడిపేందుకు రవీంద్రన్ అనర్హుడని, వెంటనే ఆయనను బయటకు పంపాలని డిమాండ్ చేసినట్టు తెలుస్తోంది. బైజూస్ సంస్థ పెట్టుబడిదారులు, షేర్ హోల్డర్లు, పాలకమండలి పదాధికారులతో కీలక సమావేశం నిర్వహించారు. సమావేశానికి రవీంద్రన్‌తో పాటు కుటుంబ సభ్యులు దూరంగా ఉన్నారు. దీంతో పెట్టుబడిదారుల్లో మరింత ఆగ్రహం వ్యక్తమయింది. సమావేశానికి ముందుగానే పలువురు భాగస్వాములు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేశారు. రవీంద్రన్ కంపెనీ నడిపేందుకు అనర్హుడని, పాలనా వ్యవహారాలు సజావుగా నిర్వహించలేదని, ఇష్టారాజ్యంగా ఖర్చు చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలుస్తోంది. కొత్త పాలకమండలిని నియమించాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. బైజూస్ మూల సంస్థ థింక్ అండ్ లర్న్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్‌లో పెట్టుబడులు పెట్టినవారు పలుమార్లు బైజూస్ రవీంద్రన్‌తోపాటు వారి కుటుంబ సభ్యులను బయటకు పంపాలని డిమాండ్ చేశారు. చట్టపరంగా సాధ్యం కాలేదని తెలుస్తోంది. ఎక్స్‌ట్రార్డినరీ జనరల్ మీటింగ్ (ఈజీఎం) లో ఎటువంటి నిర్ణయాలు అమలు చేయడంగానీ, తిరస్కరించడం గానీ సాధ్యం కాదు. కర్ణాటక హైకోర్టు నుంచి రవీంద్రన్ స్టే పొందడంతో ఎటువంటి చర్యలు అమలులోకి రావు. మార్చి 13 వరకు స్టే అమలులో ఉంటుంది. హైకోర్టు స్టేను కొట్టివేయాలని కొందరు భాగస్వామ్యులు పిటీషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్ మార్చి 13న విచారణకు రానుంది. కోర్టు ఆదేశాలు అమలులోకి వస్తే రవీంద్రన్‌ను కంపెనీ నుంచి బహిష్కరించే అవకాశం ఉంది. ఈజీఎం సమావేశం నిర్వహించకుండా రవీంద్రన్ కుటుంబం హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. సదరు పిటీషన్‌ను ధర్మాసనం తిరస్కరించింది.

ఒకరితో ప్రేమ.. మరొకరితో పెళ్లి

▸▸ ప్రైవేట్ ఫొటోలు షేర్ చేసిన ప్రియుడు

▸▸ పెళ్లైన మరుసటి రోజే భార్యను వదిలేసిన భర్త

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆడంబరంగా వివాహం జరిగిన మరుసటి రోజే వధువుకు కోలుకోలేని షాక్ తగిలింది. మాజీ ప్రియుడు ఆమె ప్రైవేట్ ఫొటోలను వరుడి అన్నకు షేర్ చేశాడు. దీంతో ఆమె తనకు అవసరం లేదని భర్త తెగేసి చెప్పాడు. బెళగావి జిల్లా కిత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ యువతి, కొడగు జిల్లా సోమవారపేటకు చెందిన ముత్తురాజ్ ఇటగి అనే యువకుడు ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ప్రేమలో ఉన్నప్పుడు ఇద్దరూ చెట్టాపట్టాలేసుకుని తిరిగారు. పలుచోట్ల ఫొటోలు తీసుకున్నారు. కొంతకాలం వీరిమధ్య శారీరక సంబంధం కూడా కొనసాగినట్లు తెలుస్తోంది. ఆ యువతికి మరో యువకుడితో ఈనెల 14న ఆడంబరంగా వివాహం జరిపించారు. అదే రోజు ముత్తురాజ్ ఇటగి అక్కడికి వచ్చాడు. పెళ్లి కుమారుడి అన్న ఫోన్ నంబరును సేకరించాడు. పెళ్లి జరిగిన మరుసటి రోజు వధువుకు సంబంధించిన ప్రైవేట్ ఫొటోలను, ప్రేమికులుగా తిరిగిన ఫొటోలను పెళ్లి కుమారుడి అన్న ఫోన్ నంబరుకు షేర్ చేశాడు. వీటిని చూసిన వరుడు.. భార్యను ఇంటి నుంచి బయటకు పంపేశాడు. న్యాయం కోసం యువతి కిత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వారు స్పందించకపోవడంతో ప్రియుడి ఇంటి ముందు బైఠాయించింది. దీంతో పోలీసులు ముత్తురాజ్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు.

ఓకల్ ఫర్ లోకల్ పేరిట ప్రదర్శనలు

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రాంతీయంగా కళాకారులను ప్రోత్సహించే దిశగా ఓకల్ ఫర్ లోకల్ పేరిట ఏర్పాటైన ప్రదర్శనలను ప్రజలు సద్వినియోగం చేసుకోవడంతో పాటు కళాకారులను ప్రోత్సహించాలని ప్రముఖ కళా కారురాలు నమ్రిత జ్యోతి అభిప్రాయపడ్డారు. చిత్రకళాపరిషత్‌లో ఇండియన్ ఆర్టిజన్ బజార్‌ను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. దేశంలోని వివిధ ప్రాంతాల కళాకారుల ఉత్పత్తులను ప్రదర్శించారు. 80కుపైగా ఏర్పాటైన స్టాల్స్ మార్చి 3వ తేదీ వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.